
## పేషెంట్ చెప్పేకథలు

# రేపటి వెలుగు



డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి

"గుడ్ మార్నింగ్ డాక్టర్ !" వేకువలో జారిన తొలికిరణంలా లోపలికి వచ్చింది మిస్ రోజీ. "గుడ్ మార్నింగ్" చిరునవ్వుతో ఆహ్వానించింది శ్రుతి. విద్యాసంస్థలు వ్యాపార సంస్థలుగా మారి హాస్టలు జీవితం తమ జీవితంలో ఒక పీడ కలగా పిల్లలు భావించే స్థాయిలోవున్న బోర్డింగ్స్ వర్ధిల్లుతున్న తరుణంలో పది మంది పిల్లల్ని తన యింట్లో వుంచుకుని వాళ్ళకు సమగ్రమైన ఆహారంతోబాటు కాస్తంత ప్రేమనూ, ఆప్యాయతనూ పంచే మిస్.రోజీ అంటే గౌరవం శ్రుతికి. పిల్లలకు కావలసింది కేవలం చదువు, విజ్ఞానం, సంపాదనకు కావలసిన సమర్థతను అలవరచుకోవడమేకాదు. వారి శారీరక, మానసిక వికాసానికి దోహదపరచే వాతావరణం, పరిస్థితులు కూడానని నమ్మి, అందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న మిస్ రోజీకి తన వంతు సహాయాన్నందిస్తూ పిల్లలకు ఏ జబ్బు చేసినా శ్రద్ధగా చూస్తుంది శ్రుతి.

"పిల్లలంతా బావున్నారా ?" శ్రుతి అడిగింది.

"ఒక కుర్రాడి విషయంలో మీ సలహా కోసం వచ్చాను."

"చెప్పండి."

"రవి తెలుసుగా మీకు?" రోజీ ప్రశ్న విని ఒక క్షణం ఆలోచిస్తూ వుండిపోయిన శ్రుతి కళ్ళు అకస్మాత్తుగా తళుక్కుమన్నాయి.

"ఓ! గుర్తొచ్చాడు. గిరజాల జుట్టు, తెల్లటి బూరి బుగ్గలు, చక్రాల్లాంటి కళ్ళను తిప్పుతూ ముద్దుముద్దుగా కబుర్లు చెప్తాడు వాడేకదూ ?" ఉత్సుకంగా చూసింది శ్రుతి.

"ఎస్.... వన్ మినిట్ రవీ !" రోజీ పిలుపు విని రవి లోపలికి వచ్చాడు.

"వీడా రవి ?" నమ్మలేనట్లు చూస్తోంది శ్రుతి. పలచబడిన జుట్టు, పాలిపోయిన చెక్కిళ్ళు, ఎండిపోయిన శరీరం, కాంతి లేని కళ్ళు. దీర్ఘకాలిక జబ్బుతో బాధపడుతున్న వాడిలా వున్నాడు.

"ఏమయింది ? ఎందుకిలా అయ్యాడు? సెలవుల్లో జబ్బేమైనా చేసిందా ?" రవిని పరీక్ష చేసి బయటకి పంపి అడిగింది శ్రుతి.

"పెద్ద జబ్బేమీ చెయ్యలేదట. కాని.... ఇతన్ని చూస్తుంటే ఇంట్లో వుంచుకోవడానికి జంకుగా వుంది. ఏమైనా జబ్బువల్ల యిలా అయిపోయాడేమో. అది మిగతా పిల్లలకు అంటుతుందేమోనన్న అనుమానం. కొంచెం కోలుకునే దాకా స్కూలు పోయినా వాళ్ళింట్లోనే వుంచుకోమందామంటే, ఇంటి మాటెత్తితేచాలు హడిలిపోతున్నాడు. బలవంతాన వాళ్ళింటికి పంపడానికి బాధగా వుంది. ఇక్కడే వుంచుకోవడానికి మిగతా పిల్లల క్షేమం దృష్ట్యా భయంగా వుంది" విచారంగా చెప్పింది రోజీ.

"క్లినికల్‌గా పెద్ద జబ్బేం కనబడడం లేదు. కాని యింత మార్పుకు కారణమేమిటో ? ఇంటి మాటెత్తితే ఎందుకు హడిలిపోతున్నాడు? అసలు కారణమేమిటో ? తెలుసుకుని కరెక్ట్ చెయ్యకపోతే ఇతను మానసికంగా యింకా దెబ్బతినే అవకాశం వుంది" దీర్ఘంగా ఆలోచిస్తూ అంది శ్రుతి.

"అతని తల్లిదండ్రుల్ని గురించి, కుటుంబం గురించి ఏమీ తెలియదా మీకు" శ్రుతి ప్రశ్న విని ఓ క్షణం ఆలోచిస్తూ వుండిపోయింది రోజీ.

"పిల్లల తల్లిదండ్రుల వ్యక్తిగత విషయాలగురించి తరచి అడిగేఅలవాటు లేదు నాకు. రవిని వాళ్ళమ్మ తీసుకొచ్చి చేర్పించింది. వాళ్ళ నాన్నెప్పుడూ రాలేదు. ఎప్పుడొచ్చినా ఆవిడ ఒక్కతే వచ్చి రవికి కావలసినవి కొనిచ్చి వెళ్తూ వుంటుంది."

"మళ్ళీ యెప్పుడొస్తుందామె? ఆవిడతో మాట్లాడి రవినిగురించి అసలు విషయం తెలుసుకోవాలి.'

"మీతో మాట్లాడి మీ సలహా తీసుకుని రవిని వుంచుకునేదీ లేనిదీ చెప్తానని రేపోసారి రమ్మన్నానామెను. రేపు మీ దగరకు తీసుకొస్తాను."

మరునాడు రవితల్లి సుభద్రను శ్రుతి దగ్గరకు తీసుకొచ్చింది రోజీ. శ్రుతి రవి గురించి, ఆమె కుటుంబంగురించి ఆమె నొచ్చుకోకుండా జాగ్రత్తపడుతూ అడిగింది. శోకదేవతలా కూర్చున్న సుభద్ర పెదవి విప్పి ఒక్క ప్రశ్నకూ జవాబివ్వలేదు. చివరికి మౌనంగానే చేతులు జోడించి సెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

చిక్కుముడిలావున్న సుభద్రను మరిచిపోవడానికి శ్రుతి ప్రయత్నిస్తూ వుండగా సుభద్ర దగ్గర్నుంచి జాబు వచ్చింది.

"డాక్టర్‌గారూ!

నేను రవి తల్లిని. అంతగా సభ్యతని పాటించకుండా మీ ప్రశ్నలకు జవాబివ్వని నన్ను మీరు మరచి వుండరనే అనుకుంటున్నాను. నేనసహ్యించుకుంటున్న నా కుటుంబ జీవితం గురించి నన్ను రంపపుకోత పెడుతున్న నా మానసిక పరిస్థితి గురించి నా అంతట నేను నోరు విప్పి చెప్పుకోలేక మీ ఎదుట మూగనోము పట్టాను.

---

### చీపిరి

గదిని సుద్ధి చేసి
బుద్ధిగా మూలనే వుంటుంది
సన్మానాలు చేయించుకోదు
గౌరవం కోరుకోదు 'ఆస్థాన చీపిర'ని
పరోపకారమే దీని జీవనం!

—రవితేజ్

---

నా చిన్నారి తండ్రి రవి అలా అయిపోవడానికి కారణం వాన్ని కన్నతల్లిని నేనే.... ఒక దానివెంట ఒకటి ఎన్నో తప్పటడుగులు వేస్తూ సమస్యల సుడిగుండంలోకి చేరుకున్నానిప్పుడు. ప్రేమించానని భ్రమించి కన్నవారిని ఎదిరించి బయటికొచ్చి రవి తండ్రిని వివాహం చేసుకున్నాను. కొన్ని నెలలు కూడా గడవకుండానే నేను పెంచుకున్న కోరికలు, నేను కన్న సుందర స్వప్నాలు ఆధారం లేనివని తెలిసొచ్చింది. మమ్మల్ని సన్నిహితం చేసిన ఆకర్షణ పొరలు విడిపోగానే నా భర్త నేను భిన్న ధృవాలమని తేలిపోయింది. నా భర్తకు నేను సంపాదించే డబ్బు కావాలి. తన పరిధిలోంచి బయటికి తొంగిచూడకుండా, పెదవి విప్పకుండా అతని అడుగులకు మడుగులొత్తుతూ బానిసలానూ పడుండాలి స్వేచ్ఛకు, బానిసత్వానికి తేడా తెలిసిన నేను బానిసలా పడివుండలేకపోయాను. అతన్ని నేను కోరుకున్నట్లుగా మార్చుకునే ప్రయత్నంలో విఫలురాల్ని అయాను. ఫలితంగా నా భర్త నుంచి విడిపోయి రవితో బయటికొచ్చేశాను.

భర్త నుంచి ధైర్యంగా విడిపోయి బయటికొచ్చిన నేను అంతే ధైర్యంగా బ్రతకలేకపోతున్నాను. ఈ క్రొత్త జీవితాన్ని, క్రొత్త పరిస్థితుల్ని చూసి నేను బెదిరిపోతున్నాను. అనుక్షణం భయంతో ఒణికిపోతున్నాను. నేను కోరుకున్న జీవితం నాకు లభించలేదన్నదుగ్ధ, ప్రస్తుతం నేననుభవిస్తున్న జీవితంపట్ల నాకున్న అసంతృప్తి కలిసి నిర్ధయగా నా మనసుని నలిపేస్తున్నాయి. నేనేం చేస్తున్నానో, ఎలా ప్రవర్తిస్తున్నానో తెలియనంతటి ఉన్మాద స్థితిలోకి పోతున్నాను. పువ్వులా సుకుమారంగా చూసుకోవలసిన పసివాణ్ణి క్రూరంగా హింసించాను. నా రెక్కల కింద దాచుకుని రక్షించవలసినవాణ్ణి అతి దారుణంగా బాధించాను. నాలోని మాతృత్వం, మానవత్వం మంటగలిసిపోయి పిశాచినిలా ప్రవర్తించాను.

నా బాబు గురించి మీరు, మిస్ రోజీ పడుతున్న ఆరాటం చూశాక నా తప్పు తెలిసొచ్చింది. నిష్ఫలంగా గడిచిపోతున్న నా ఈ జీవితమెలా తిరిగిరాదో కమ్మని కలలా గడిచిపోవలసిన నా బాబు బాల్యమూ తిరిగిరాదు. వ్యక్తిగా నా సుఖ సంతోషాల గురించి తాపత్రయపడడమే గాక తల్లిగా ప్రేమతో నా బాబు భావికి సోపానాలు వెయ్యవలసిన బాధ్యతకూడా నా మీదుందనే నిజాన్ని గుర్తు చేశారు మీరు. రవి నన్ను ప్రేమతో పెనవేసుకొని రోజున నేను వ్యక్తిగానూ, భార్యగానేగాక తల్లిగా కూడా ఓడిపోయినట్లే లెక్క అన్న వాస్తవాన్ని గుర్తించేలా చేశారు. అందుకు మీకెంతో కృతజ్ఞురాల్ని.

నా మనసును నలిబిలి చేస్తున్న సంఘర్షణ నుంచి తప్పుకుని రవి కోసం స్థిర చిత్తంతో పరిస్థితులతో పోరాడతాను. ఇంక నా ప్రాణం, జీవితం, లక్ష్యం అన్నీ రవే.

నమస్సులతో,
సుభద్ర.

